క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: తుమ్మిందపాళ్యం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు. తుమ్మిందపాళ్యం, పెద్దిశెట్టిపల్లె, తొప్పాతిపల్లె, అడవిచేను, దిగువూరు, మత్రిమడుగు, జెత్రిమడుగు, చెన్నసముద్రం, నాయనిచెరువు ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వివరించారు.

చిత్తూరు కమిషనర్ బాధ్యతల స్వీకరణ


నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నరసింహ ప్రసాద్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. పుంగనూరులో పని చేస్తున్న ఈయన్ను చిత్తూరుకు బదిలీ చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. విజయవాడలో నెలకొన్న వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం నరసింహప్రసాద్ అక్కడ ప్రత్యేక విధులను కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆయన విజయవాడ నుంచే బాధ్యతలు తీసుకున్నారు. మరోవైపు చిత్తూరు కమిషనర్‌గా పనిచేసిన అరుణ ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యి, మాతృశాఖ పంచాయతీరాజ్‌లో రిపోర్ట్ చేశారు.

సమస్యలు పరిష్కరించండి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు విన్నవించారు. స్థానిక గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రంతాల్లో నుంచి తమ సమస్యలను బాధితులు తెలిపారు. మొత్తం 4 సమస్యలు రాగా అందులో 2 సమస్యలు పరిష్కరించామని ఈఈ మునిచంద్ర పేర్కొన్నారు. మిగిలినవి ఆర్థిక అనుమతులు రాగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈలు కేశవచంద్ర, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నిత్యావసర ధరలు తగ్గించి, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం వారు నిరసన చేపట్టారు. నిత్యావసర ధరలు తగ్గించాలని, రేషన్‌కార్డు ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, నాగరాజు, మణి, విజయగౌరి, జమీలాభి, కుమారి, కవిత, రఘు, గజేంద్రబాబు, చంద్రయ్య, రవి, రమేష్‌బాబు, కుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం


మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

తవణంపల్లె: అక్రమంగా పట్టుబడిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. జిల్లా ఎస్పీ మణికంత చందోలు ఆదేశాల మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో 11447 బాటిళ్ల (1965 లీటర్లు) మద్యాన్ని జేసీబీ యంత్రంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శ్రీధర్‌బాబు సమక్షంలో ధ్వంసం చేశామన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పకడ్బందీగా ఓటరు నమోదు

బంగారుపాళెం: మండలంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం సాయంత్రం ఓటరు నమోదుపై బీఎల్ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే చేసి 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లను నమోదు చేయాలన్నారు. ఓటరు నమోదుపై బీఎల్ఓలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఓటరు నమోదు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇబ్రహీం, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.15 కోట్లు


కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,15,81,533 భక్తులు కానుక రూపంలో సమర్పించుకున్నారు. అలాగే బంగారం 49 గ్రాములు, వెండి 1.30 కిలోలు ఉంది. గో సంరక్షణ హుండీని లెక్కించగా రూ.7,940, నిత్య అన్నదానం హుండీ నుంచి రూ.24,025, విదేశీ కరెన్సీ యూఎస్ఏవీ 602 డాలర్లు, యూఏఈ 25 దిర్హామ్, ఆస్ట్రేలియావి 20 డాలర్లు, సింగపూర్ 2 డాలర్లు, ఇంగ్లాడ్‌వి 30 పౌండ్స్ వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ గురుప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన్న భోజనం

గ్రౌండ్ రిపోర్ట్

- రుచీ పచీ లేని మధ్యాహ్న భోజనం
- మింగుడు పడని అరగుడ్డు
- వసతి గృహాల్లోనూ అదేతీరు
- చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో పర్యవేక్షణ శూన్యం

పాఠశాలల వివరాలు		
ప్రాథమిక పాఠశాలలు	-	502
ప్రాథమికోన్నత పాఠశాలలు	-	78
జెడ్పీ పాఠశాలలు	-	122
విద్యార్థుల సంఖ్య	-	53,500

ప్రభుత్వ బడులు, వసతుల్లో తిండికి తిప్పలు మొదలయ్యాయి. బడి బయటే వంట చేసి, పాఠశాలకు తీసుకొచ్చి వడ్డిస్తున్నారు. దీంతో రుచీ పచీ కరువవుతోంది. బడిలో వంటకు మంట లేక ఆరు బయటే వంట వండుతోంది. నాణ్యత దూరమై పిల్లలకు నాలుకకు రుచి అంటడంలేదు. పలు చోట్ల అరగుడ్డు పిల్లలకు మింగుడు పడడంలేదు. జలం శుద్ధ దండగలా మారుతోంది. భోజన అమలు తీరుపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

కాణిపాకం: బడిపిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో నీరుగారుతోంది. మధ్యాహ్న భోజనం వండేవారికి ఇస్తున్న చార్జీలు.. పెరిగిన ధరలకు అనుగుణంగా లేక నాణ్యతపై ప్రభావం పడుతోంది. రుచీపచీ లేని భోజనం తినలేక విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ప్రభుత్వ లెక్కల్లో మాత్రం 80 నుంచి 90 శాతం మంది భోజనం చేస్తున్నట్లు చూపుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా కనిపిస్తోంది. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, వసతి గృహాల్లో భోజనం అమలు తీరును ‘సాక్షి’ గురువారం పరిశీలించింది. అపరిశుభ్ర పరిసరాలు, చప్పిడి అన్నం, నీళ్లను తలపించే సాంబారు, తాగేందుకు ఉపయుక్తం కాని జలం, ముద్దగా మారిన అన్నం.. వంటి ఎన్నో సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలు ఉన్నాయి. వసతి గృహాల్లో రెండు పూటలా భోజనం పెడుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ స్కూళ్లలో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. మెనూ తూచ తప్పక అమలు చేయాలని అధికారులు స్పష్టం చేస్తున్నా ఏమాత్రం మార్పు ఉండడంలేదు. ఇక్కడ ఇష్టానుసారంగా వంట వండి పెడుతున్నారు. ప్రభుత్వం రేషన్ బియ్యం పాఠశాల ఉచితంగా సరఫరా చేస్తోంది. అవి ముక్కివాసన రావడం, కొంచెం ఎక్కువ ఉడికినా ముద్ద కావడం వల్ల పిల్లలు చాలాచోట్ల తినడానికి ఆసక్తి చూపడంలేదు.

పెరిగిన ధరతో మెనూ ఎలా?

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.5.40, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాల పిల్లలకు రూ.7.85 చొప్పున ఈ భోజనం కోసం చెల్లిస్తారు. వంటనూనె, పప్పుగింజలు, కూరగాయలు, చింతపండు, పోపు దినుసులు, ఉల్లిపాయలు, గ్యాస్ ఇవన్నీ ఇందులోంచే సరిపెట్టుకోవాలి. వందలోపు విద్యార్థులున్న చోట గిట్టుబాటు కాక నాణ్యత విషయంలో నిర్వాహకులు రాజీ పడుతున్నారు. కంది పప్పు కేజీ రూ.200 నుంచి రూ.230 వరకు పలుకుతోంది. తెల్లగడ్డ కిలో రూ.300పైమాటే. ఉల్లిపాయ కూడా ప్రస్తుతం ఘాటెక్కిస్తోంది. కిలో రూ.50 దాటింది. దీంతో పాటు కొన్ని కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలకు అందించే భోజనంలో కూరగాయలు, పప్పు దినుసులు కరవవుతున్నాయి. పెరిగిన ధరలతో ఏం చేయాలో, ఎలా వండాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని నిర్వాహకులు వాపోతున్నారు. అది రుచిగా తయారు చేయాలంటే అవసరమైన అన్ని దినుసులు వేయాలి. అప్పుడే పిల్లలు ఆసక్తిగా తినగలుగుతారు.


చిత్తూరు మండలం గంగసారం పాఠశాలలో విద్యార్థికి వడ్డించిన అన్నం

ఒకేసారి ఇచ్చేస్తూ..

కోడిగుడ్డు కూర పెట్టాలని మెనూలో ఉంది. నాణ్యతగా చేస్తే ఖర్చవుతుందని భావించి నీళ్ల సాంబారు, రుచీ పచీలేని వంట వండిపెడుతున్నారు. చాలా చోట్ల బడి ఆవరణలో వంట వండి పెట్టడంలేదు. ఆరుబయట వంట వంట వండి తెచ్చి పెడుతున్నారు. అక్కడ ఎలాంటి ప్రాంతంలో వంట వండుతున్నారో.. ఏరకంగా వండుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. నాణ్యత లోపం కారణంగా చాలా మంది పిల్లలు ఆ భోజనాన్ని తినేందుకు పిల్లలు ఇష్టపడడం లేదు. గుడ్లు ఉడకబెట్టి కట్ చేసి పిల్లలకు అరగుడ్డు పెడుతున్నారు. పప్పుకూరలో కూరగాయలు కనిపించవు. వేరుశనగ చిక్కీ మాత్రం పిల్లలు ఆసక్తిగా తినగలుగుతున్నారు. గుడ్లు సరఫరా చేసే వారు రవాణా చార్జీలు తగ్గించుకోవడానికి నెలకు సరిపడేలా ఒకేసారి ఇచ్చి వెళ్తున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వల్ల ఇవి కుళ్లిపోతున్నాయి. వండిన తరువాత దుర్వాసన వచ్చి పిల్లలు తినడంలేదు. ఈ అంశాలను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు. చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు.

భయపెట్టిస్తున్న వాతావరణ పరిస్థితులు

గత నెల రోజులుగా వాతావరణ పరిస్థితులు భయపెట్టిస్తున్నాయి. ఈ తరుణంలో సీజనల్ వ్యాధులు, ఎక్కడికక్కడే వాంతులు, విరేచనాలు విరుచుకుపడుతున్నాయి. ఇలాంటి తరుణంలో చాలా చోట్ల పరిశుభ్రత కానరావడం లేదు. ముఖ్యంగా స్వచ్ఛమైన తాగునీరు కరువవుతోంది. కొళాయి నీళ్లు, వ్యవసాయ బోరుబావుల వద్ద బిందెల్లో నీళ్లు తెచ్చిపెడుతున్నారు. చాలా బడులు, వసతి గృహాల్లో వాటర్ ప్లాంట్‌లు ఉన్నా అవి మరమ్మతుకు గురయ్యాయి. ఉపాధ్యాయులు, అధికారులు సైతం వాటిని అలాగే వదిలేశారు. దీని కారణంగా పిల్లలకు జబ్బులు చుట్టుముడతాయని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.




బంగారుపాళ్యంలో గురుకుల పాఠశాలలో మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్, శ్రీలంక కాలనీలో వడ్డిస్తున్న భోజనం, వండి పెట్టిన అన్నం

ప్రాంతం	వసతిగృహం	వసతుల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
చిత్తూరు	బీసీ వసతిగృహం	05	1240
చిత్తూరు	ఎస్సీ వసతిగృహం	07	1145
చిత్తూరు	ఎస్టీ వసతిగృహం	02	450
పూతలపట్టు	అంబేడ్కర్ గురుకుల పాఠశాల	01	558
పూతలపట్టు	ఎస్సీ బాలుర వసతి గృహం	01	60
పూతలపట్టు	ఎస్సీ బాలుర వసతిగృహం	01	40
ఐరాల	ఎస్సీ బాలుర వసతిగృహం	01	58
ఐరాల	ఎస్సీ బాలుర వసతిగృహం	01	40
బంగారుపాళ్యం	ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్	01	118

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

చిత్తూరు కలెక్టరేట్: పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఒక మొక్కను నాటాలని డ్వామా పీడీ రాజశేఖర్ అన్నారు. నగరంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నట్లు విద్యార్థులకు తెలిపారు. మొక్కలను పరిరక్షించడం విద్యార్థుల బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ, డ్వామా ఏపీడీ సుబ్రహ్మణ్యం, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తీసుకోవాలి

బంగారుపాళెం: వినాయక చవితి మండపాలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని మండల త్రిసభ్య కమిటీ సభ్యులు తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ శివశంకర్, సీఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మండలంలో వినాయక మండపాల ఏర్పాటుపై త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ, గ్రామాల్లో ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

దుకాణాలకు నిర్వాహకులు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం దాబాలు, హోటళ్లు, దుకాణాల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, దుకాణాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలు జరగకుండా నివారించేందుకు అవకాశం ఉందన్నారు. తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య జీవనం

ఐరాల: గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుంటే మరింత ఆరోగ్యంగా జీవించవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి గ్రామంలో పర్యటించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి వడబోసిన నీటిని తాగాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: పర్యావరణ పరిరక్షణకు మట్టిగణపతినే పూజిద్దామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని తెలిపారు. వినాయక చవితి విశిష్టతను పెంచేలా మనమంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో తయారు చేసిన మట్టి వినాయకుని విగ్రహాలను పూజించాలన్నారు. పండుగ రోజు లౌడ్ స్పీకర్లను వినియోగించి ధ్వని కాలుష్యం కలిగించరాదన్నారు. కార్యక్రమంలో కాలుష్య కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్, ఏఈ మదన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం



తవణంపల్లె: పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: సీజనల్‌గా వచ్చే అంటువ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారిఅనూష అన్నారు. మండలంలోని నారగల్లు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 55 మందికి మందులు, మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, సుమతి, గీత పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని దిగువమాఘంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం పాల్గొన్నారు.

80 మందికి వైద్య సేవలు

పూతలపట్టు: మండలంలోని యం.బండపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని 80 మంది రోగులను పరీక్షించి వారికి తగిన మందులను అందజేశారు. డాక్టర్ ప్రియాంక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నేడు గురుపూజోత్సవం

తవణంపల్లె: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో గురువారం గురు పూజోత్సవం నిర్వహించనున్నట్లు ఎంఈఓలు హేమలత, త్యాగరాజులరెడ్డి తెలిపారు. దీనికి పూతలపట్టు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వారు తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేయనున్నట్లు వివరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు ప్రారంభించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను మరింత విస్తృతం చేయాలన్నారు. 8800002024కు మిస్డ్ కాల్ ద్వారా పార్టీ సభ్యత్వం తీసుకోవచ్చని చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరు




భువనేశ్వర రెడ్డి, సుశీలమ్మ, అరుణ్‌కుమార్

ఐరాల: మండలంలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న అరుణ్‌కుమార్ జిల్లాస్థాయి ఉత్తమ హెచ్‌ఎం అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఈయన మొట్టమొదట చిత్తూరు మండలం దొడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో గణితం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. అక్కడి నుంచి 2005లో యాదమరి జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. 2010లో ప్రధానోపాధ్యాయుడుగా ఉద్యోగోన్నతి రావడంతో యాదమరి నుంచి శాంతిపురం మండలం కర్లగడ్డ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ 9 నెలలు హెచ్‌ఎంగా పనిచేసి సర్వ శిక్షా అభియాన్‌లో ఎంఐఎస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్‌గా రెండేళ్లు విధులు నిర్వర్తించారు. 2014లో గుడిపాల మండలం కమ్మతిమ్మాయిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేశారు. 2021లో ఐరాల మండలం ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్లో ప్రస్తుతం హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు– నేడు పనులను తమ పాఠశాలలో వాయివేగంతో పూర్తి చేయించారు. 2021–22, 2022–23 విద్యా సంవత్సరాలకుగాను ఎం.పైపల్లె పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి పంపడంలో అరుణ్‌కమార్ కీలకపాత్ర పోషించారు. దీంతో అరుణ్‌కుమార్‌ను జిల్లా స్థాయి ఉత్తమ హెచ్‌ఎంగా ప్రకటించారు.

ఎంపికైన సుశీలమ్మ, భువనేశ్వరరెడ్డి

తవణంపల్లె: పాఠశాల అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు విద్యాబోధనలో ప్రత్యేక శ్రద్ధ, స్వచ్ఛభారత్, పరిసరాల శుభ్రత, శిక్షసత్సాహ, విద్యా ప్రవేశం, మధ్యాహ్నం భోజనం నిర్వహణ, విజ్ఞాన యాత్రలు, భాషోత్సవాలు, విజ్ఞాన మేళా వంటి పలు కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఉత్తమ సేవలందించారు. దీన్ని ప్రభుత్వం గుర్తించి మండలంలోని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న సుశీలమ్మ, మండలంలోని తెల్లగుండ్లపల్లెలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న భువనేశ్వర రెడ్డిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు ఎంఈఓలు హేమలత, త్యాగరాజులు రెడ్డి తెలిపారు. వీరందరూ గురువారం చిత్తూరులో జరగనున్న జిల్లా స్థాయి గురుపూజోత్సవంలో కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.